# గోలకొండ పత్రిక

ప్రతి బుధవారము శనివారము ప్రకటింపబడును.

REGISTERED No. N. 45 హైదరాబాదు—దక్కన్. REGISTERED No. M. 2185

సంపుటము ౨ } ప్రభవ సంవత్సర పాల్గుణ బ॥ ౮ శనివారము (౧౦ మార్చి ౧౯౨౮) { సంచిక ౮౩


## ఆఫ్రికాలో ఫ్రెంచి దౌర్జన్యము

### నీగ్రోలపై ఘోరహింసలు

లామిన్ సెంఘోరు అను నీగ్రోనాయకుడు బ్రస్సెల్సు కాంగ్రెస్సులో మాట్లాడుచు నిట్లుపన్యసించెను —

ప్రపంచములో నన్ని జాతులకన్నను మాజాతి (నీగ్రోజాతి) యంతేటను విశేషముగా హింసింప బడుచున్నది. మా జీవితములన్నియు సామ్రాజ్య వాదుల (Imperialist) హస్తములందున్నవి. వీరు మాకన్న నెట్లుత్తములు, తెల్లనితోలున్నదనియా? లేక హెచ్చు మేధాశక్తి యున్నదనియా? వారు మాకన్న నెట్లుమేలు? ఈజిప్టు ప్రతినిధియగు హాఫిజ్ రంజన్ బేగ్ గారు ఇటీవల హిందూస్థానపు నాయకులగు పండిత మోతీలాల్ నెహ్రూగారితో ఈజిప్టు పరాధీనత నొందలేదని చెప్పిరి. అది నిజముకాదు. ఇంగ్లీషువారు ఈజిప్టు దేశముయొక్క ప్రాథమిక హక్కులను లాగుకొనినారు. ఫ్రెంచివారు మా దేశమునకు మొదట వచ్చినప్పుడు "మేము మిమ్ములను నాగరికులనుగా జేసెదము" అనిచెప్పిరి. కాని నేడు మాకు విద్య నేర్పుటనే నిరాకరించిరి. ఏలనన మేము విద్య నేర్చిన మమ్ములను వారిష్టము వచ్చినట్లు ఆడించ జాలరు. ఈ ఫ్రెంచివారు మమ్ముల నెట్లు నాగరికులనుగా జేసిరో కొన్ని నిదర్శనములను జూపింతును.

"హూలాటీ అను ఫ్రెంచి అధికారి" "మోనఙా" అను నూయంత్రశాలనొక బానిసని లూటీచేయుట కాజ్ఞయిచ్చెను. ఆలూటీలో నింకను నేక వస్తువులనీ యధికారియే తీసికొననని నేనతనిపై నేరమారోపించు చున్నాను. "క్వెస్సో" అను నగరాధికారి ౧౯౨౫ లో నొక నీగ్రోనౌకరిని ఘోరముగా హింసించినందుకు నిందించుచున్నాను. ఈ ఫ్రెంచి యధికారి తన నౌకరియగు నీగ్రో తన ౫౦౦ ఫ్రాంకులను దొంగలించినట్లు నేరమారోపించెను. ఆ నేరమును వాడొప్పుకొనక పోగా వాని యుడుపులను విప్పి వానిని నగ్నునిగా జేసి వాని వృషణముల కొక బల్లపై మోపి సుత్తెతో మోదెను. నీగ్రో వెంటనే మూర్ఛనొందెను. ఎట్టకేలకు మూర్ఛ తేరగా "ఒప్పుకొనెదవా లేక మరల నీ వృషణముల బగుల గొట్టుమనా" యని మరల యీ క్రూర కార్యమునకు సంసిద్ధుడయ్యెను.

బనిహాయను నగరాధికారి "గణ" యను నీగ్రోగుంపు పెద్దను బట్టికొని తాను చెప్పినట్లు ఆచరించ నందులకు నాతని చేతి నొక యినుప ప్రెస్సులో నుంచి చిదుమగొట్టెను. అంతటితో తనివి చెందక ఉక్కుముల్లుకుల కొరడాతో వాని శరీరము చిల్లులుపోవ కొట్టి శరీరమంతయు తేనెబూసి యెండలో తుమ్మెదలు కఱచుటకై వానినుంచెను. "ఫ్రెంచి వెస్టు ఆఫ్రికాలో నెట్టిపనులను జేయించుచున్నారు." ఇవన్నియు నిట్లున్నను ఫ్రెంచివారు బానిసల వృత్తిని మాన్పినామని యబద్ధములు చెప్పుచున్నారు.

మొన్నటి యుద్ధములో దొరకినట్టి ప్రతి నీగ్రోనుకూడ పట్టుకొని పోయి యుద్ధములో ఫిరంగులకు మేతగా జేసిరి. అన్యాయము మితిమీరగా నొక నీగ్రోకు బిరుదులిచ్చి లేనిపోని గౌరవము చేసి స్వదేశము నకంపి యచ్చట గౌరవార్థము వాద్యములతో వానిని ఊరేగించిరి. ఈ బిరుదమందిన వాడు ౫౦ వేల మందిని మరల యుద్ధమునకు లాగుకొని పోయెను. అంతకుముందే ౨౫ లక్షల మంది పోయియుండిరి. మా దేశీయులను మొరాకో యుద్ధములో బలియిచ్చిరి. నేడును వారిని మొరాకో, సిరియా, లో ఖూనిచేయు చున్నారు. ఇటీవలనే మా వారిని చీనాలో పోట్లాడుటకు పంపినారు.

ఓ చీనా ప్రతినిధులారా! మిమ్ముల సోదరులనుగా నాలింగనము చేసి కొనుచున్నాను. మీరు అరుగు బాటుకు మంచి యుదాహరణమై యున్నారు.

ఫ్రెంచి సామ్రాజ్య వాదులారా! నీగ్రోలు చాల కాలము సహించినారు. జ్ఞాపకముంచుకొనుడు మేము మేలుకొంటిమి. మరల నిద్రపోము.

ఫ్రెంచివారి న్యాయము చూడుడు. వారి దేశముకొఱకై మా నీగ్రోలుకూడ ప్రాణములర్పించిరి కాని వానివారికి సెంతయో తారతమ్యము! కాళ్లు చేతులు విరిగిన ఫ్రెంచివారికి సంవత్సరమునకు ౧౨ వేల ౫౦ ఫ్రాంకుల భరణార్థమిచ్చిన కాళ్లు చేతులు విరిగిన మా నీగ్రోలకు ౧౫౦౦ మాత్రమే యిచ్చుచున్నారు.

ఈ సభవారు సామ్రాజ్య తత్వమును నాశనము చేయ ప్రయత్నించ వలెను. ఈ సామ్రాజ్యత్వము ప్రపంచమంతటను మహా మారివలె వ్యాపించియున్నది. ఇది నాశనమైనప్పుడే ప్రపంచమునకు శాంతికలుగును.

## అముద్రిత తాళపత్రి గ్రంథములు

10-3-28

### శ్రీగద్వాల మహారాణీ గారొసగినట్టి

రెడ్డి గ్రంథాలయము (హైదరాబాదు) నకు శ్రీ గద్వాల మహారాణీగారు దయతో క్రిందియముద్రిత గ్రంథముల నొసగియున్నారు. వారికి కృతజ్ఞులై సందుకొనినారము.

౧ అతికాయ యుద్ధము (పద్యకావ్యము)
౨ సుబ్బరాయని శతకము టీకాతాత్పర్యసహిత
౩ జ్ఞానమయూఖము (సంస్కృతము)
౪ నాదకౌతూహలము
౫ సుగ్రీవ విజయము
౬ నరసింహ పురాణము ధర్మయ్యకవి
౭ భార్గవపురాణము (బవేరిసోమనాథుడు)
౮ బల్వద చరిత్ర (వేంకటదాసకవి)
౯ శ్రీశైల పురాణము శేషనాథాంకకవి
౧౦ గోపాలవిశ్వప్రశ్నలు సంస్కృతము
౧౧ భానుమతీ పరిణయము (చెటూరి రంగరాజు)
౧౨ నాగసింహాసనము (తూర్పురాజకవి బాలసరస్వతి)
౧౩ కృష్ణశతకము (కృష్ణప్రధానుడు) (కప్పటూరు) కొండశతకము ,,
౧౪ ఆంజనేయచరిత్ర }
౧౫ మైరావణ చరిత్ర } కర్తల పేరు తెలియదు
౧౬ విదుర మైత్రేయ సంవాదము }
౧౭ సకలజీవ సంజీవనము (వేంకటాద్రినాయకు)
౧౮ అశ్వాయుర్వేదము (సంస్కృతము)
౧౯ వామనపురాణము (ఓబళకవి)
౨౦ దివ్యదేశ మాహాత్మ్యము ద్విపద (గోడనామ వేంకటదాసు)
౨౧ తుంగామాహాత్మ్యము సంస్కృతము స్కాంద పురాణాంతర్గతము
౨౨ కుశలవోపాఖ్యానము ద్విపద
౨౩ మాహేశ్వరతీర్థము సంస్కృతము
౨౪ పరమయోగి విలాసము (తిరువేంగళనాథ)
౨౫ ధర్మరాజాశ్వమేధము కృష్ణప్రధానకవి
౨౬ కోకశాస్త్రము ఎల్లయకవి
౨౭ సంస్కృతము ఉద్యోగపర్వము (పూర్వపు చిత్తరువులతో)

పై గ్రంథము లందొకటిరెండు ముద్రితములై యుండినప్పటికిని ఇవిగాక యీ క్రిందివి సారాంశముల కొఱకు ఇతరులకు నుపయోగపడునని యవలోకనార్థ మొసగబడియున్నవి.

౧ వివేకసింధు [వచనము]
౨ రాజశేఖర చరిత్ర
౩ రామాయణము ద్విపద (కొచబయమ్మ, విఠ్ఠల విభుడు)
౪ ,, ఇతర ప్రతి ,,
౫ రంగనాథ రామాయణము (గోనబుద్ధారెడ్డి)
౬ రాజవోలు వేంకటేశ్వర శతకము—మరియు కీర్తనలు
౭ సుగ్రీవ విజయము } కవులెవరో
గజేంద్ర మోక్షణ }
౮ రతిరహస్యము (కొక్కోక కవికృత సంస్కృతము)
౯ శుకసప్తతి (కదిరీపతి)
౧౦ శుకసప్తతి ,, ౭౦ కథలున్నవి హంసవింశతి (నారాయణకవి)
౧౧ భిరితిరస ప్రకరణము ముద్రితము
౧౨ ఆచార్యచంపు ,,

ఈ గ్రంథము లన్నిటిలో కొన్ని యుత్తమములును ప్రచురణ యోగ్యములును నగు గ్రంథము లున్నవి. మహారాణీగారి విద్యా ప్రయత్నమునకు సంతసించుచు మా హృదయపూర్వక కృతజ్ఞతను నిందుమూలమున తెలుపుకొనుచున్నాము. నిజాము రాష్ట్రమున పూర్వపు ఆంధ్రవాఙ్మయము ఇంకెన్నో యజ్ఞాత వాసము చేయుచున్నది. ఇట్టి లెక్కలేని అముద్రిత గ్రంథములను మాకు పంపిన గ్రంథాలయమునందుంచి పరిశోధనకును, ముద్రాపకులకును తగు సౌకర్యములు కల్పింపగలము.

రెడ్డిహాస్టల్ } ఇట్లు
రెసిడెన్సీ హైదరా } సురవరము ప్రతాపరెడ్డి
బాదు దక్కను } గౌరవ కార్యదర్శి

# ఒక్కమాట-పత్రికాధిపతులకు

ప్రేక్షకుడు

## V

నేను ఇక్కడ నే వ్రాసిన మొట్టమొదటి వ్యాసం విమర్శనయని చాలా మంది పొరబడ్డారు. నా వ్యాసాన్ని విమర్శించినవారు, ఖండించినవారు కూడా ఈ పొరపాటుకు లోబడినారు. ఇది ఒక వింత కాదు. సాధారణంగా "విమర్శన" అనే మాట మన తెలుగు భాషలో చాలా మంది అజాగ్రత్తగా వాడతారు. ఒక పుస్తకం చదివేటప్పుడు గాని ఒక నాటకాన్ని చూసేటప్పుడు గాని మొట్టమొదట దాని వలన మన మనస్సులో ఒక "మనోముద్ర" Impression కలుగుతుంది. పుస్తకములోని కథాక్రమం వివిధ పాత్రలగుణవిశేషాలు, మానవ జీవనముయొక్క అద్భుతమయ స్వభావం, ధర్మ నిరతులదుర్భర దుఃఖజీవనం, ఆదర్శాలవినాశం, మున్నగు అంశాలు మనలో ఒక ఆవేశం కలుగ జేస్తాయి హృదయాన్ని కలత పెడ్తాయి. పుస్తకాన్ని బట్టి అవాచ్యానందమో, అకారణ విషాదమో, ఆశ్చర్యమో దుర్భర దుఃఖమో, లేక ఇదమిత్థమని చెప్పరాని భావపరంపర [illegible] మనకు కలుగుతుంది. ఆ ఉద్వేగస్థితిలో ఒక స్నేహితునితో, ఆ పుస్తకం గూర్చి, వెడలి గ్రక్కిన మాటలు, వ్రాసిన వ్రాత "భావముద్ర" యని యంటారు. హాల్ కేన్, విక్టరు హ్యూగోనవలలు. ఇబ్సను, మాటర్లింకు, టాల్ స్టాయి నాటకాలు చదివినవారిలో వానివలన గలిగిన ముద్రనిన్నటికిని మరువశక్యంగాదు. ఇదే కొంత చల్లారిన తరువాత, టూకీగా, శాంతంతో, వెలువడి "అభిప్రాయం" Opinion అవుతుంది. దీనికంటె విపులంగా, మొత్తంమీద పుస్తకంయొక్క గుణవిశేషం, లోపం, గ్రంథకర్త భావధోరణి మూడవవారిమనంగా వ్యక్తపఱచెడి సమాలోకనం Review, విశదంగా, విస్పష్టంగా, పుస్తకంయొక్క గుణవిశేషాలు, లోపాలు, సహేతుకంగా, ఉదాహరణలతో నిరూపిస్తూ, యితర గ్రంథాలతో సరిపోల్చి చూస్తూ, గ్రంథకర్త మూలాభిప్రాయం, దాని తత్వం చర్చిస్తూ వ్రాసిన వార్త విమర్శన Criticism. ఇట్లు భావముద్రలో భావోద్రేకం ప్రబలంగా ఉంటుంది, అభిప్రాయంలో ఈ ఆవేశం చల్లారి ఉంటుంది; సమాలోకనంలో బుద్ధి [Reason] గ్రంథక్షేత్రమంతటి మీద ఒక వీక్షణాన్ని విసురుతుంది; విమర్శనలో ఈ బుద్ధి, విచక్షణ [illegible]తో, ప్రత్యేక విషయాన్ని తేరిపార జూస్తుంది.

దీన్ని బట్టి నా మొదటి వ్యాసంలో వ్రాసింది భావముద్ర యని తెలుస్తుంది. పత్రికలు గూర్చి నాకు గల ఉన్నతాదర్శం, రాష్ట్రపత్రికల హీనస్థితి, ఒక ప్రబోధ సాధనం [illegible] కదా [illegible] విచారం, పత్రికాధిపతుల [illegible], పత్రిక [illegible] నడపడాని కేల ప్రయత్నించవలెనో అన్ని కొందరపాటు కలిసి వ్రాతకు తీవ్రత [illegible] సావధానంగా ఇప్పుడు విమర్శించే ఆవశ్యకత కలిగించాయి.

### రూపం

పత్రిక రూపం చదువరుల నాకర్షించటానికెంతో సాయంగా ఉంటుంది. కాగితం దళసరిగాను, అచ్చు శుభ్రంగాను, తేటగాను ఉంటే చదువడానికి ఉత్సాహంగా ఉంటుంది, ఇండియను డైలీమెయిలు హిందూ పత్రిక [illegible] ఇప్పటి రాష్ట్ర పత్రికలలో తెనుగుపత్రిక గోలకొండ కాగితాలు బాగుగానే ఉన్నాయి కాని నీలగిరి కాగితాలుమాత్రం హీన తరగతికి జెందినవి. అందుచేత ఒకవైపు అచ్చు రెండు వైపుల కనబడి చదవడానికి కష్టంగా ఉంటుంది.

### వ్రాతల విపులత

పత్రికలో చదవడానికి తగినన్ని వ్రాతలుండాలి. పత్రిక ౧౨ పేజీలుంటే అందులో కనీసం ఏడెనిమిది పేజీలైన వ్రాతతో నిండి యుండాలి. దిన పత్రికల విషయం యిది. వార పత్రికల్లో వ్రాతలింకా ఎక్కువుండాలి. వారం రోజుల వార్తలు సూక్ష్మంగాను, వివిధ తరగతుల వ్యాసాలు, విపులంగాను ఉండవలసి ఉంటుంది గాబట్టి వ్రాతలకోసం ఎక్కువ పేజీలు ప్రత్యేకించాలి. కాని మన రాష్ట్ర పత్రికలిట్లా నడపటం లేదు. నీలగిరిలో సాధారణంగా చదవవలసిన వ్రాతలతో ౪ పేజీలే ఉంటాయి. తక్కినవన్నీ ప్రకటనలే. వారపత్రికలు వ్రాతలతో కిక్కిరిసి నిండేటట్లు ఉండాలి. దినానికి ఒక పేజీచొప్పున చూచుకున్నా కనీసం ఏ పత్రికలోనైనా ౭ పేజీలుండడం ధర్మం; కాని యిది నీలగిరిలో లోపం. ఒక్కొక్కప్పుడు రెండు మూడు వారాల కొకపత్రిక బయలుదేరుతూ ఉంటుంది. అందులోకూడ ఏ నాలుగో ఆరు పుటలే ఉంటాయి. తెనుగుపత్రిక ఆగిపోయింది గనుక దానిగూర్చి చర్చించ దలచలేదు. గోలకొండలో మొత్తముమీద సుమారు ౭ పేజీల వ్రాతలుంటాయి. ఈ సంఖ్య సుమారుగా నన్నుప్పటికి ఇంతకంటె ఎక్కువ పేజీలుంటే శ్రేష్ఠం.

### ప్రకటనలు

హీనమైన ప్రకటనలకు తావియ్యక పోవడం ఉత్తమం. కాముబండ్, దీజబండ్, వీర్యబంధు మున్నగు ప్రకటనలు బాలుర భావములను మలినం చేస్తాయి. సిగరెట్ల ప్రకటన వేయు టన్యాయమని కొందఱు ప్రశ్నించవచ్చు. ఏది ప్రకటించాలి, ఏది కూడదని ఒక జాబితా తయారుచేసి చెప్పటం సాధ్యము కాదు. కాని, పిల్లవాండ్ర పవిత్ర భావాలు, ఆ మానుషత్వం చెడ గొట్టకుండా ప్రతి గృహంలో పత్రిక నిలిచేటట్లు దానిని నడపాలనే [illegible]గారి సూత్రం, సందర్భంలో దృష్టియందుంచుకొని పత్రిక సాగనియ్యాలి. ఈ సూత్రంబట్టి నీలగిరిలోని కొన్ని ప్రకటనలు ఆపివేసిన ఉత్తమం.

### వ్యాసాలు

వారపత్రికలలో, [illegible] వ. ౧ ప్రాముఖ్యత ఉంటుంది. దిన పత్రికలలో వార్తలకు ప్రాముఖ్యత ఉంటుంది. వ్యాసాలు రెండు తరగతులుగా భాగింపవచ్చునని యిదివరలోనే చెప్పాను. [illegible] మానవ కోటి సమస్యల గూర్చినవి మొదటి తరగతిలోవి. ఇవి చాలా కొద్దిగా నీలగిరిలో నున్నవి. గత పది సంచికలు చూచినా ఏ ఒకటి రెండు వ్యాసాలో కనబడవు. మొత్తంమీద గోలకొండకూడ [illegible] యుంది. నిజాం రాష్ట్రాన్ని ఎదుర్కొని ఉన్న సమస్యలెన్నో లెక్కలేనన్ని ఉన్నాయి. రాష్ట్ర విద్యా విధానము, రైతులు, భూమిపన్ను, ఇనాములు, సహకారోద్యమము, గ్రామపంచాయితీలు, లోకల్బోర్డులు, మునిసిపాలిటీ, సుంకములశాఖ, మున్నగు వానిగూర్చిన సమస్యలు, అటు పరిపాలకశాఖలోని లోపాలు చెప్పలేనన్ని ఉన్నాయి. వీనిగూర్చి, నాకు తెలిసినంతవరకు శ్రేష్ఠమైన వ్యాసాలు [illegible] రాలేదు [illegible] సూచించిన విషయాలలో కొన్నిటిగూర్చి యింతవరకు ఒకటైనా వ్యాసం వ్రాయలేదు. రాష్ట్రం అభివృద్ధి పొందాలంటే, యివి తప్పక ఉండి తీరాలి. అప్పుడే ప్రభుత్వంలోని లోపాలు సవరింపబడతాయి. ప్రజలలోకూడ మేలుకొలుపు, పరిపాలనగూర్చి శ్రద్ధ, పౌరజీవనం అభివృద్ధి కలుగుతుంది.

ఒక్క ఉదాహరణ జూడండి. రాష్ట్రంలోని అడవుల గూర్చి అనేక సమస్యలున్నాయి. అడవిసంపదలలో ఎంతవరకు వృథాయయి పోతున్నాయి? కారణాలేమిటి? సవరించడం ఎట్లా? [illegible], కలప అవసరాలు, చాలినన్ని ఉన్నాయా? లేకపోతే వాన్ని పొందడానికి మార్గాలేవి? ఈ సందర్భంలో ఇతర దేశాల్లో ఏ యే మార్గా లవలంబిస్తున్నారు? పరిపాలన విధానంలో లోపాలెట్లా చక్క బఱచాలి? వీన్ని గూర్చి చర్చిస్తూ వ్యాసం వ్రాస్తే ప్రజలకు, ప్రభుత్వానికి ఎంత లాభం ఉంటుందో వేరే చెప్పనక్కఱలేదు కదా.

విషయ విజ్ఞాన వ్యాసాలు రెండో తరగతివి. ఇవికూడ మొత్తంమీద మన పత్రికలలో తక్కువనే చెప్పవలసుంటుంది. ఇతర దేశంలోని సంస్థలు, ఉద్యమాలు, గూర్చి చక్కగా, పరిపాటిగా వ్రాసే వ్యాసాలు చాలా అవసరం. ఈ విషయాల్లోకూడ, యిప్పుడు మన రాష్ట్రంలో అమలులోనున్న ఉద్యమాలే యితర దేశాలలో ఏ యే పద్ధతులమీద సాగుతూ ఉన్నవో; లేక యిప్పటి అవసరాలు కొన్ని పూర్తిజేయగల వ్యవస్థ లితర దేశాలలో ఏదేవి ఉన్నవో, వాని గూర్చి వ్రాస్తూండటం యిప్పటికి చాలా లాభంగా ఉంటుంది. అదీకాకుండ ముఖ్యంగా ఈ రాష్ట్రానికి సంబంధించిన అన్ని విషయాలు. యీ రాష్ట్ర ప్రజలకు పరిపూర్ణంగా తెలిసి ఉండాలి. మన రాజకీయ విధానము, రయితులు, వర్తకము, [illegible]దారుల గతులు, ఆర్థిక విధానము, వివిధ సంస్థల శాఖలు, ప్రజాహిత జీవనము, జాతులు, వాఙ్మయము, మొదలైన వానిగూర్చిన విజ్ఞానము పరిపాటిగా ప్రజలలో వ్యాపించడానికి, తగిన వ్యాసాలు [illegible]ాలి. [illegible] రాష్ట్రీయులకు అవసరమైన పరిమితిగలవా? ఎన్ని తరగతు[illegible]

లు గలవు? వానిలోని పంథుననేవి? ఆశాఖావిధాన మెటులున్నది? ఇట్టివిషయ విజ్ఞాన పరములైన వ్యాసం గానీయబడకలో ఒక్కటీలేదు.

### సక్రమముగ వెలువడుట

పత్రిక నిశ్చితదినానికి వెలువడుతుండాలి. ఇది ప్రతి పత్రికకు ఉండవలసిన ఆవశ్యకమైన గుణము. చందాదారులు ఇట్లా లేకపోతే విసుగుకుంటారు. పత్రిక ప్రతిష్ఠకు లోటు. గోలకొండ శనివారం ప్రకటించ వలసినది. కాని హైదరాబాదులో ఆదివారము ప్రొద్దున పంచిపెట్ట బడుతుంది. జిల్లాలకు కూడ ఆలస్యముగా పోతుందని వినికిడి. నీలగిరి కూడ యిట్లాగే హైదరాబాదు చేరేటప్పటికి ఒకటి రెండుదినాలాలస్యం అవుతూ ఉన్నది. అంతేకాక ఒక్కొక వారం పత్రిక మొదటికే లేదు. తరువాతి పత్రికను రెండు పత్రికలుగా అంకితం చేస్తారు. ఇది వ్యవహార రీత్యా చాల గొప్ప పొరపాటు. దీనివల్ల పత్రిక మీద గౌరవం పోతుంది. ఇది ఒక్కసారి చేయటమే ప్రమాదం. అల్లాంటప్పుడు ఇది క్రమముగా జరుగుతూ ఉండే పత్రికంటే హేళనయి పోతుంది. ప్రభవ సం॥ మార్గశిర బ॥ ౭ గురువారమునాడు బయలుదేరిన సంచికకు ౧౮-౧౨ అని రెండు పత్రికలుగా అంకితమిచ్చారు. దాని తరువాతది సరిగనే ఉంది. కాని మాఘశుద్ధ మాత్రం ౧౪-౧౫-౧౬ గా నిరూపించారు. దాని తరువాత ౨౦ వ సంచికలో ౭౨ పేజీని ౫౦-౫౧ గను ఇంకొకదానిని ౩౭ గనే అంకితమిచ్చేరు. కాని తరువాత సంచికను ౨౧-౨౨ గా అంకితం చేశారు. ఇది చూచేవారికి హాస్యాస్పదంగా ఉంటుంది. ఈ ఆచారం మానుకోవాలి.

### వార్తలు

దిన పత్రికలలో వలె వార్తలకు వారపత్రికలలో అంత ప్రాముఖ్యత లేకపోవటం నిజమే గాని, మన రాష్ట్రంలో దినపత్రికలు లేవు గాబట్టి ఆలోటంతా ఈ వారపత్రికలే తీర్చాలి. అందుచేత తగినన్ని వార్తలు తప్పక ప్రకటించాలి. అందులోను రాష్ట్రీయ వార్తలకు ప్రాముఖ్యత ఉండాలి. కాని యిట్లా జరగటంలేదు. నీలగిరిలో రాష్ట్రమునకు వెలుపలి వార్తలు సాధారణంగా ఒకటి రెండు కాలములలో పూర్తియౌను. గోలకొండలో ఒక పేజీ యిస్తారు కాని యిట్లు నిష్పక్షగా ఎల్లప్పుడు చేయరు. ఒక్కొక్కప్పుడు ౨ కాలములలో సరిపుచ్చుతుంటారు. ఈ వార్తల సేకరణలోకూడ సరియైన విచక్షణ కనబడటం లేదు. ఇరాకు, గ్రీసు, రష్యా గూర్చిన వార్తలకంటె భారత దేశంగూర్చి యెక్కువ వార్తలు పడవలసి ఉంది. ఈ వార్తలకోసం ౧ పేజీ ప్రత్యేకించినా అసమంజసంగా ఉండదు. వారము దినముల వార్తలు బాగుగా ప్రకటించాలంటే యింత స్థలం అవసరం అని వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. [illegible] లో మద్రాసులో సమావేశాలు, పెద్ద సభలు జరిగాయి. కాని వానిలో ఏ విధానము గురించి మాత్రం గోలకొండలో వార్తలు ప్రకటించేదు. అందుచేత జిల్లాలలో ఉన్నవారికి [illegible] కాని వార్తల [illegible] సభలగురించి ఏమీ తెలియలేదు. ఇక నీలగిరిలో కాంగ్రెసు కార్యక్రమం, తీర్మానాలుగూర్చి ఒక్క మాటకూడాలేదు.

నిజాం దేశవార్తలగూర్చి నీలగిరిలో ఎక్కువ పట్టుదల కనిబడటంలేదు. ఒక కాలమే సాధారణంగా కనబడుతుంది. రెండు కాలములు కనబడడం అరుదు. గోలకొండలో యివి ఒక పేజీవరకు సాధారణంగా ఉంటాయి గాని వార్తలమాత్రము చాలాపట్టుగ ముఖ్యముగా ఉండవు.

### సంపాదకీయాలు

వీనిలోకూడ ఒకటి రెండులోపాలు కనబడుతున్నాయి. నీలగిరిలో మొత్తముమీద వీనిగూర్చి తగినంత శ్రద్ధ పట్టుదల కనబడదు. కొ, రామ [illegible] గారిటుల వ్రాయుచున్నారు లేదా శేషాద్రి రమణకవులిటుల వ్రాయుచున్నారు అని యితరుల వ్రాతలు సంపాదకీయంగా వేయు ఆచారం ఎక్కడాలేదు. ఇవి జాబులుగా ప్రకటించాలి. లేకపోతే సమకాలికాభిప్రాయంగా ప్రకటించాలి గాని సంపాదకీయాలలో వానికి స్థానంలేదు. ఇంతేకాదు. భారతదేశ సమస్యలపట్ల ఉపేక్ష కనబడుతుంది. ౧౯౨౭ సం॥ డిసెంబరు ౧౫ నుండి, ౧౯౨౮ సం॥ మార్చి ౧ వరకు వెలసిన పత్రికలలో, భారత దేశమంతటిని కలచివేస్తూ ఉన్న సైమను కమిషనుగూర్చి ఒక సంపాదకీయం లేదు. కాంగ్రెసు, తదితర సభలు, ఢిల్లీ శాసన సభ, మున్నగు జాతీయ జీవనానికి ఆయువు పట్టులుగానున్న సంస్థలు, ఉద్యమాలు గూర్చికూడ ఈ ఉపేక్షే కనబడుతుంది. పత్రికకింత సంకుచిత దృష్టి, దాని కార్యరంగ పరిమితి నింత చిన్నదిగా అణచివేయడం, ఎన్నటికీ కూడదు. ఈ జాతీయ ఉద్యమాలే మన రాష్ట్రపు ప్రజలలో పౌర జీవనముల పట్ల ఆవేశం, కాంక్ష కలిగిస్తాయి. కాబట్టి వీటిగూర్చి వృత్తాంతాలు వ్యాఖ్యలు, సంపాదకీయాలు తరచుగా ప్రకటిస్తుండాలి.

### ధోరణి

సంపాదకీయాలు, ప్రజలలో అభివృద్ధి మార్గాలు, ఉద్యమాలు, పట్ల ఆవేశం కలిగిస్తూ ఉండాలి. ప్రజలలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, తమ స్వాతంత్ర్యముకై పోరాడు పట్టుదల కలిగించాలి. రాచకీయ శాఖలలోని లోపాలు బయటబెట్టాలి, ఉద్యోగుల అక్రమ వర్తనలు ఖండించాలి. ప్రజాహిత ఉద్యమాల విశ్వాసం పెంపగాలి. కాని యిట్లు జరుగుటలేదు. ప్రభుత్వమువారి చర్యల విమర్శించుపట్ల చాలా భయము, ఉదాసీనత వ్యక్తమవుచున్నది. కాని ప్రస్తుత పరిస్థితులలో అతి సాహసపు వ్రాతలవల్ల పత్రికకే ముప్పు వస్తుంది. గాబట్టి జంకవలసి వస్తుంది. అయితే ఎంతకాలమిట్లా పడి ఉండాలి? అనే ప్రశ్న వస్తుంది. కాబట్టి సమయము కనిపెట్టి ఘాటిగా విమర్శనకు పూనుకొనక పోయినా, పరిపాలక విధానాల తత్త్వము, ఇతర సంస్థానాలు, రాష్ట్రాలలో ఈ విధానాలెట్లా ఉన్నాయో చూపిస్తూ, చక్కగా[illegible]తో విమర్శన సాగించాలి. [illegible] పరిపాలకులు తమ చాకచక్యం ఉపయోగిస్తూ ప్రవర్తించాలి గాని యిది కర్తవ్యం అని నిర్ధారణ చేయలేము.

ఈలోపాలకు కారణాలు ఇంకొక వ్యాసంలో వివరిస్తాను.

## మన గ్రామాధికారులు

### “అరే” అని సన్మానించుట

రయ్యతు పత్రికలో నొకరిట్లు వ్రాయుచున్నారు. మన దేశములో ప్రతిగ్రామములో ఇద్దరు పటేండ్లు ఒక పట్వారి యున్నారు. వీరిని “ఓహదెదారాన్ దేహీ” గ్రామాధికారులని సర్కారు పేరిచ్చి యున్నది. వీరిస్థితికిని బ్రిటిషు దేశములోని వారిస్థితికిని చాల భేదమున్నది. బ్రిటిషిండియాలో తహసీల్దారు మున్నగు నధికారులు వీరిని “కరణంగారూ” అని పిలుతురు కాని మన నిజాంరాష్ట్రములో వీరిస్థితి హేయముగా నున్నది. మామూలి సర్కారీ జవానుకూడ వీరిని ‘గారూ’ అని సంబోధించ మరచుట యటుండనిండు ‘ఓరే’ అనికూడ పిలుచుచున్నారు. జవానులనగా మామూలు. కాని విద్యావంతులగు నధికారులనేమన వలెను. వారు తమహుకుములలో నిట్లు వ్రాయుదురు.

“సర్కారి నౌకరిపేర నివుపోయి ఫలాని గ్రామములోని పట్వారీ [లేక పటేలును] యీ కాగితము చూచి యెట్లుండిన వానినట్లే పట్టుకొనిరమ్ము” దీని కర్థమేమా? జవాను మాత్రము అట్లు చేయుటలేదు. గ్రామముపోయి, తిని, నిద్రపోయి, పన్నెండు గంటలకు వాపసు వచ్చును. నేను ౨౦ యేండ్లనుండి యీస్థితి నిరూపించు చున్నాను. ఇటీవల కూడ నిట్టి హుకుమొకటి చూచితిని. ఇట్టివియుండక జరుగునట్లుగా సర్కారు ఏర్పాటు చేయుట మంచిది.

# వివిధ విషయములు

## ఇండియా గవర్నమెంటు బడ్జెట్టు.

### క్రొత్త సంవత్సరపు అంచనా.

ఆదాయము ౧౩౨ కోట్ల ౨౩ లక్షలు.
వ్యయము ౧౨౯ కోట్ల ౬౦ లక్షలు.

నిలవ...౨ కోట్ల ౬౩ లక్షలు.

౧. రాజధాను లిమ్మని కోను చుండిన కప్పములు శాశ్వతముగ తొలగింపబడినవి. ఈ మొత్తము ౨౫౯ లక్షల రూపాయలు.

౨. క్రొత్త పన్నులు విధింపబడలేదు.

౩. యంత్రముల దిగుమతులపై విధింపబడుచుండిన కస్టమ్సు పన్నులు తగ్గింపబడినవి. దీని వలన రాబడిలో తగ్గుదల సుమారు ఒక కోటి రూపాయలు.

౪. మిలిటరీకి ౫౫ కోట్ల ౧౦ లక్షల రూ. ప్రత్యేకించిరి. ఇది క్రింది సం. పు వ్యయము కంటె ౧౯ లక్షలు అధికము.

౫. పోస్టు, టెలిగ్రాపు శాఖలలో తక్కువ జీతములు పొందుచున్న పనివారికి జీతము హెచ్చింప బడునని ఆశగలదు.

౬. ప్రభుత్వమువారు ఈ సం. న ౩౨ కోట్ల రూ. అప్పును జేయుదురు.

౭. ౧౯౨౮ సం. మార్చి ౩౧ నాటికి ప్రభుత్వమువారి మొత్తపు అప్పు ౯౯ కోట్ల ౬౧ లక్షల రూపాయలు.

## మిల్లరు కన్య

పదమ్యుతుడైన ఇండూరు మహారాజా గారు పెండ్లాడ తలంచిన మిస్ మిల్లర్ యీ నెల ౧౩ వ తేదిని జగద్గురు శంకరాచార్య డాక్టర్ కుర్తుకోటి గారి సమక్షమునందు నాసికులో హిందూమత స్వీకరణ మొనర్చెను. ఈ సందర్భమున వారీ ప్రకటన గావించిరి.

"మిల్లరు కన్య వైదిక ధర్మమునందు ప్రవిష్టురాలు కాతలచి నాయనుజ్ఞ గోరినది. ఆమె సదుద్దేశమును నేను విశ్వసించితిని. హిందూధర్మమును దూషించిన మేయో కన్యకు మిల్లరు కన్యయొక్క వైదిక ధర్మ స్వీకరణము తగిన సమాధానము కాగలదు. వైదిక ధర్మము సమస్త మానవులకు తరింపజేయుటకు నుద్దేశింప బడినది. శరణాగతులను రక్షించని దేవుడు దేవుడు గాడు, ధర్మస్వీకారమును గోరువారిని బహిష్కరించు ధర్మము ధర్మము కాదు. మిల్లరుకన్యయొక్క ఆర్యధర్మ స్వీకారము జగదాకర్షణీయముగ నుండగలదని నా నమ్మకము.

మహారాజా గారు ఇండూరునకు వెడలి యున్నారు. వీరివివాహోత్సవములను అమెరికా సినిమా ఫిల్ము కంపెనీవారు యధార్థ ఫిల్ములను సిద్ధముచేసి అమెరికాయందు ప్రదర్శించ నున్నారట.

## సింహా ప్రభువుగారి అకాలమరణము

మార్చి ౪ వ తేది రాత్రి ౨-౩౦ గంటలకు బర్హాంపురమునందు సింహా ప్రభువుగారు హృద్రోగముచే పరమపదించిరి.

అచట స్థానిక మిత్రప్రముఖులుగానున్న వారి పుత్రుడగు సుశీలసింహాగారిని చూచుటకై కీ. శే. ప్రభువుగారు మంచి ఆరోగ్యముతోనే వెడలిరి.

సింహాగారి ఉత్తరక్రియలు కలకత్తాలో జరుపబడెను.

వారిభార్యకు సానుభూతి తంతివార్తలు పంపబడుచున్నవి.

బొంబాయి శాసన సభలో శాసన సభాధ్యక్షుడు సుఖతేదన సింహా ప్రభువుగారి అకాల మరణమును గూర్చియు, వారి దేశ సేవా ధురంధరతమునుగురించియు ముచ్చటించి సభవారి సానుభూతిని వెల్లడించిరి.

సింహా ప్రభువుగారి తరువాత వంశ పారంపర్యముగా వీరి పెద్ద కుమారులగు అరుణ సింహాగారు ప్రభు బిరుదమును వహించెదరు. అరుణ సింహాగారు ప్రస్తుతము స్విట్జర్లాండులో నున్నారు.

## టిక్కా సాహెబుగారు నాభా సంస్థానాధిపతులైరి

ఇటీవల ఇండియా ప్రభుత్వమువారిచే ప్రకటింపబడిన ఉత్తరవు ప్రకారము మహారాజా గురుచరణ సింగుగారి పుత్రులగు టిక్కా సాహెబుగారు (మహారాజా ప్రతాపసింగు) నాభా సంస్థానమునకు అధిపతులైరి.

బొంబాయి మహాజన సంఘమువారు, అఖిలభారత సిక్కులీగు వారు గురుచరణ సింగుగారిని అన్యాయముగా ప్రవాసశిక్ష అనుభవింప జేసినందులకు ప్రభుత్వమువారి చర్యను ఖండించుచు తీర్మానముల గావించిరి.

## నీలు సత్యాగ్రహము

మద్రాసులో నీలు విగ్రహమును దీసివేయవలెనని గత ౪ నెలలనుండి ఆందోళన, సత్యాగ్రహము జరుగుచున్నది. ఇప్పటికనేకులు అరెస్టు చేయబడిరి. ఈ ఉద్యమము క్రమముగా నడపుటకు ఒక సంఘము ఏర్పరుచ బడియుండెను. వారు ఇప్పుడీ తీర్మానము చేసిరి.

"సైమను కమిషను మద్రాసు విడిచిపెట్టునవరకును బహిష్కార సంఘమువారికి తమ సత్యాగ్రహులను సహాయముగా నిచ్చియుండు చేతను, మద్రాసులో నూతన పరిస్థితు లేర్పడుటచేతను, నీలు సత్యాగ్రహము ప్రస్తుతము నిలుపుచేయుటకు యీ సంఘమువారు నిశ్చయించు చున్నారు ''

## కలకత్తాలో ౩౨ బహిరంగ సభలు

బహిష్కారోద్యమము బలమగు చున్నది. ప్రజలీయాందోళనను పట్టుదలతో చేయుచున్నారు. ౧ వ మార్చి సాయంకాలము ౩౨ వార్డులందు ఒక్కసారి ౩౨ సభలు జరిగినవి. బ్రిటిషు వస్తువులను ముఖ్యముగ వస్త్రములను బహిష్కరించవలెనని సభలలో బోధచేయబడెను. తీర్మానము లన్నియు అమలు జరుపుటకు ప్రమాణములు గైకొనబడెను. సాయంకాలము పట్టణ చుట్టుపట్లను గూడ సభలు జరిగెను. వివిధ ప్రాంతములందు ఊరేగింపులు జరిగెను.

## ఆంధ్రవిశ్వ విద్యాలయము

ఆంధ్ర విశ్వవిద్యాలయము ఎకడమిక్ కౌన్సిలు ఫిబ్రవరి ౨౫ తేది శ్రీయుత్ సి. ఆర్. రెడ్డి (వైసు ఛాన్సలరు) గారి యధ్యక్షతను సమావేశమైనది.

అధికార కార్యక్రమము నిర్ణయింపబడిన పిమ్మట నోటీసు చేయబడిన తీర్మానములు చర్చింపబడెను.

ఎస్. వెంకటరామయ్యగారు దినమున కొక్క పేపరులోనే పరీక్ష జరుగవలెనని తీర్మానము చర్చింపబడెను. సిండికేటు వారును రిజస్ట్రారుగారును ప్రతికూలాభిప్రాయము వెలిబుచ్చినందున తీర్మాన మోడిపోయెను.

వైసు ఛాన్సెల్లరుగారు యీ క్రింది తీర్మానము సభయెదుట బెట్టిరి.

స్త్రీలకొరకు నియమింప బడియున్న ప్రస్తుతపు కోర్సులకు బదులుగా ప్రత్యేక కోర్సులు నియమించు విషయము నాలోచించవలెననియు యీ సూచన యామోదింప బడినచో దాని నమలులో బెట్టుటకు తగు విధానము సూచింపవలెననియు సిండికేటు ఎకడమిక్ కౌన్సిలును గోరుచున్నది. పై తీర్మానములో నిమిడియున్న ప్రధాన సూత్రమును సభవారామోదించిరి.

వి. సి. సీతారామ శాస్త్రిగారి యీ క్రింది తీర్మానమేకగ్రీవముగా నామోదింప బడెను. పఠనీయ గ్రంథములుగా నియమింప బడినట్టి అధునిక తెలుగు గ్రంథకర్తలచే నుపయోగింప బడిన భాష విద్యార్థుల రచనకు తగినమాదిరి భాషగా నామోదింప బడవలెను.

పిమ్మట యీ క్రింది విషయము విచారణకు జేబడెను:— "ఎక్స్పెరిమెంటలు సైకాలజీలో రీడరుషిప్పు స్థాపించుటకు శ్రీ పానగల్లు రాజాగారు రూ ౫,౦౦౦ సాంవత్సరిక విరాళ మొసగుట కంగీకరించినందునను, మరి రూ ౯,౨౦౧ లపై మొత్తమును చేర్చుటకు ప్రభుత్వము వారంగీకరించినందునను యీ విషయమున తగు యేర్పాటు గావింపవలయును."

పై సూచన సభవారిచే నేకగ్రీవముగా నామోదింప బడెను. మధ్యాహ్నము ౧౧ గంటలకు సభ ముగిసెను.

రిజస్ట్రారు పదవికి మొత్తముమీద ౬౩ దరఖాస్తులు చేరియున్నవి ఆ దరఖాస్తులన్నియును పరీక్షింపబడగా యీ క్రింద ముగ్గురలో నొకరిని సెనేటువారెన్నుకొనవలెననియు, వీరిలో మొదటివారగు ప్రస్తుత రిజస్ట్రారు సి. డి. ఎస్. చెట్టిగారే మరల నియమింప బడవలెనని సిండికేటువారేకగ్రీవముగా సిఫారసు చేయుచున్నారు.

౬౩ దరఖాస్తు దారులలో యీ క్రింది ముగ్గురు సిఫారసు చేయబడిరి:—

(౧) సి. డి. ఎస్. చెట్టి (ప్రస్తుత రిజస్ట్రారు) గారు (౨) వి. ఎస్. తమ్మా (నోబుల్ కాలేజి ప్రొఫెసరు) గారు (౩) కె. శేషాచలం చౌదరి (మద్రాసు లెదరు ట్రేడ్సు ఇన్స్టిట్యూటులో కెమిస్టు) గారు.

## ప్రధానమంత్రిపై విశ్వాస రాహిత్యము

మద్రాసు శాసనసభలో స్వరాజ్య పక్షమువారిచే ప్రధాన మంత్రిగారిమీద తేబడిన విశ్వాస రాహిత్య తీర్మానమును మొదట పర్యాయము చర్చకు తెచ్చుటకు అధ్యక్షులు అనుమతి నొసంగెను. చట్టప్రకారము ౪౨ సభ్యులు తీర్మానమున కనుకూలముగ నిలువబడినగాని ఉపపాదనను చర్చించుటకు వీలులేదు. ౩౪ సభ్యులు మాత్రమే తీర్మానమున కనుకూలముగ నిలువబడుటచే నిది ఓడిపోయినట్లు ప్రకటింప బడినది.

ఇది యిట్లుండగ డెవెలప్మెంటు మంత్రియగు రంగనాథ మొదలియారుగారు, ఆరోగ్య శాఖ మంత్రియగు ఆరోగ్యసామి మొదలియారుగారు తమ పదవులకు రాజీనామా యిచ్చిరని హిందూపత్రిక తెలుపుచున్నది.

గోలకొండ పత్రిక
ప్రభవ సంవత్సర ఫాల్గుణ బ॥ ౮
శనివారము

## కీ. శే. సిన్హా ప్రభువు

గడచిన ౫ వ తేదీ రాత్రి ౧౧-౩౦ గంటలకు మూర్షిదాబాదు జిల్లాలోని బరహాంపూరు నగరమునందు సచ్చిదానంద సిన్హా ప్రభువుగారి యాకస్మిక మరణముచే భారత భూమి యింకొక నాయకుని గోల్పోయినది. రాయిపూరునందు ౧౮౬౩ సంవత్సరమున జననమొంది, ౧౮౭౭ లో మెట్రిక్యులేషను బూర్తిజేసి కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రవేశించిరి. ౧౮౮౧ సంవత్సరమున ఇంగ్లండుకు బోయి లింకన్సు ఇన్‌లో జేరి ౧౮౮౬ వ సంవత్సరమున న్యాయవాది వృత్తి స్వీకరించిరి. అనతికాలములోనే కలకత్తా బారిష్టరులలో పేరు వడసిరి. క్రమక్రమముగ ౧౯౦౩ లో ప్రభుత్వమువారికి స్టాండింగుకౌన్సెలుగాను ౧౯౦౮ బెంగాలు అడ్వొకేటు జెనరలుగను నియోగింప బడిరి. అటుపైని మార్లే ప్రభువు రాజప్రతినిధి సభకు భారతీయ ప్రతినిధిగ నియోగింప బడిరి. ఇట్టి ఉన్నత పదవి బడయుటకు వీరే ప్రప్రథములు. ౧౯౧౦ లో ఈ పదవికి రాజీనామా నొసంగి తిరిగి న్యాయవాది వృత్తిలో ప్రవేశించిరి. ౧౯౧౫ వ సంవత్సరమున మరల అడ్వొకేటు జెనరలుగను, తదుపరి [illegible]లో బెంగాలు ఎక్జిక్యూటివ్ కౌన్సిలు సభ్యునిగను, [illegible] యుద్ధ సభకు హిందూదేశ ప్రతినిధిగను భారత ప్రభుత్వమువారు నియోగించిరి. సంస్కరణముల తదనంతరము మాంటేగు గారి యధికారమున అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేటుగా పనిజేసిరి. ౧౯౨౦ లో బిహారు ఒరిస్సా రాష్ట్రములకు గవర్నరుగా నియమింపబడిరి. ఈ మహోన్నత పదవి బడయుటకు నేటివరకు వీరొక్కరే భారతీయులు. ౧౯౨౧ లో తమ ఉద్యోగమునకు రాజీనామ యిచ్చిరి. వీరు బడసిన ఉన్నతోద్యోగములే వీరి మేధా సంపదకు సాక్షి.

వీరు కేవలము తమ స్వంత ఔన్నత్యమునకే తమ జీవితమునంతటిని ధారబోయలేదు. భారత స్వాతంత్ర్యమునకై, జాతీయోద్యమమున పాల్గొని ౧౯౧౫ లో బొంబాయి నగరమున జరిగిన దేశీయ మహాసభ కధ్యక్షత వహించిరి. బ్రిటిషు ప్రభుత్వమువారు కుయుక్తులు, మొగమాటపు తుచ్ఛపుమాటలు మాని భారతదేశ రాజకీయ గమ్యస్థానమును నిర్ధారణ జేయవలెనని గోరిరి. తదుపరి ప్రభుత్వోద్యోగమున నుంటచే రాజకీయ రంగమున ప్రవేశింపలేదు. అసహాయోద్యమమును ఎదుర్కొని దేశీయుల నిరాదరణకు పాల్పడిరి. ౧౯౨౧ నుండియు నే విషయమునందును పాల్గొనక తటస్థులై యుండిరి. వీరు ప్రభుత్వము వారును, స్వదేశీయులును తమ్మెంత నిరసించినను సరకు గొనక తమ నిశ్చితాభిప్రాయములను ప్రకటించుటయందును, తదను గుణముగ ప్రవర్తించుటయందును వెనుదీయని నీతి వర్తనులు. తమ సామర్థ్యము కొలది ప్రభుత్వమువారిని గొలచిరి. తామోపిన కొలది దేశసేవ జేసిరి. ఇట్లొక ఉన్నత రాజకీయ వేత్త జీవనము పరిసమాప్తి జెందినది. వారి యాత్మకు శాంతిగలుగుగాక.

### శ్రీమంత మహారాజా రామదేవరావు గారి వివాహ మహోత్సవము

శ్రీమంత మహారాజ రామదేవరావు బహద్దరుగారి వివాహ మహోత్సవము నేడు జరుగనున్నది. వరులైన శ్రీమంత రాజాగారు సుమారు ౨౧ సంవత్సరముల వయస్సువారు. వీరికి మాతృభాషయందే కాక ఇంగ్లీషు ఉర్దూ భాషలలో మంచి పాండిత్యమున్నది. వీరు చాల శాంతస్వభావులును నిగర్వులునై యున్నారు. వధువు శ్రీమంత పింగిలి వేంకటరామారెడ్డి దేశముఖుగారి పుత్రికారత్నము. ఈమెయును ఆంధ్రమందే కాక ఉర్దూ యింగ్లీషులలో మంచి ప్రవీణ సంపాదించి యున్నది.

శ్రీమంత రామదేవరావు బహద్దరుగారి జనకులగు కీ॥ శే॥ మహారాజా రామేశ్వరరావు బహద్దరు గారు రెడ్డి సంఘమునకు మహోపకారమొనర్చినందుకు మద్రాసు రెడ్డిజన సంఘమే సాక్ష్యమిచ్చుచున్నది. మఱియు వారి ప్రథమ కుమారులైన కీ॥ శే॥ కృష్ణదేవరాయలు గారు చిన్న వయస్సుననే మరణించుటచే యిచ్చటి రెడ్లకును, నాంధ్రులకును గొప్ప ప్రాపు దప్పెను. ప్రకృతపు రాజా రామదేవరాయలు గూడ ఆంధ్రులయెడ తమ యభిమానము వెల్లడింతురని యాశించుచున్నాము.

శ్రీయుత పింగిలి వెంకటరామారెడ్డి దేశముఖు గారు ఇచ్చటను, బ్రిటిషాంధ్ర దేశమందును ప్రఖ్యాతులైనవారు. వీరు రెడ్డి హాస్టలునకును రెడ్డిజన సంఘమునకును ముఖ్యాధారభూతులు.

ఇట్టి యీ యుభయవంశములకు కలుగుచున్న బాంధవ్యము ఆంధ్రులకందఱకు అమితానంద దాయకమై యున్నది. విజ్ఞానవంతులగు వధూవరుల దాంపత్యము సౌఖ్యదాయకమై వర్ధిల్లుగాక! పరమేశ్వరుడీ దంపతుల నాయురైశ్వర్యారోగ్య సంపదలచే రక్షించుగాక!

### హారోల్డు మాన్ గారు

మన నిజాము రాష్ట్రములో ఉన్నత ప్రభుత్వోద్యోగిగా హారోల్డుమాన్ గారు నియోగింప బడినారను వార్త రాష్ట్రీయులందఱును సంతోషింప దగినది. ఇట్టి యుత్తమోద్యోగి మనకు లభించుట మన యదృష్టవిశేషము. వీరు మొదట మొదట పూనా వ్యవసాయ కళాశాలాధ్యక్షులై యుండి యుత్తమ విద్యాబోధము చేయుచుండిరి. తర్వాత వీరు బొంబాయి రాష్ట్ర వ్యవసాయ శాఖాధ్యక్షత వహించి బహు కాలము పనిచేసిరి.

వీరు బొంబాయి రాష్ట్రములో గ్రామములందనేక స్థలములలో పరిశోధనములు సలిపి అచ్చటి వ్యవసాయస్థితిని దెల్పు గ్రంథములను ప్రకటించి యున్నారు. ఈ గ్రంథములు వీరికి రైతులయందుగల ప్రేమను, వీరి మేధాశక్తిని వీరి సంపూర్ణ వ్యవసాయ పరిజ్ఞానమును వెల్లడి చేయుచున్నది.

మన దేశమున వ్యవసాయ స్థితియు, వ్యవసాయకుల స్థితియు నత్యంత సంతాపకరముగా నున్నది. బ్రిటిషు ఇండియాలోని రైతులు పండించు పంటలలో సగము భాగముకూడ మన రైతు లదేపరిస్థితులలో పండింపజాలని వారైయున్నారు. అట్టిచో నిట్టి యుత్తమ పండితులయొక్క సహాయము మనకు అత్యంతావశ్యకముగా నున్నది.

హారోల్డుమాన్ గారు ఇటీవలనే యుపకార వేతనముపై తమ స్వదేశమగు నింగ్లాండునకు వెడలియుండిరి. మరల మన ప్రభుత్వముయొక్క యాహ్వానముచే నిచ్చటికి రాతెంచి యున్నారు. వీరిచ్చట యుద్యోగము చేయుదురని వినుట చాల యానందకరమైనది. వీరు రైతుల దుస్థితిని, దారిద్ర్యమును,

అజ్ఞానమును బాపి, వీరి కృతజ్ఞతకు పాత్రులగుదురని నమ్ముచున్నాము.

ప్రొఫెసరు వీరభద్రుడు

నిజాముకాలేజిలో ప్రొఫెసరుగానున్న తణికెళ్ల వీరభద్రుడు ఎమ్. ఎ. ఎల్ టి గారిని పట్నా విశ్వవిద్యాలయము వారు, ఆంగ్లవాఙ్మయముగూర్చి తమ కళాశాలలో వార్షికోపన్యాసముల (Extonsien lectures)నిచ్చుటకై ఆహ్వానించిరి. వీరిదివఱలో విజయనగర కళాశాలలలోను, ప్రెసిడెన్సీ కళాశాలలోను అసిస్టెంటు ప్రొఫెసరుగా నుండిరి. వీరు, తమ పాండిత్య విశేషము చేతను! స్నేహ సౌజన్యము వలనను విద్యార్థులు, సహోధ్యాపకులు, బయటి పెద్ద మనుష్యుల యొక్క ఆదర గౌరవముల బడయుచున్నారు. మద్రాసు రాజధాని కళాశాల విద్యార్థులలో వీరి నెఱుగని వారుండరు. ప్రొఫెసరు రాధా కృష్ణనుగారి తరువాత ఇతర యూనివర్సిటీచే వార్షికోపన్యాసముల నిచ్చుట కిట్లాహ్వానింపబడిన యాంధ్రులు వీరే. ఈ గౌరవమునకై వీరభద్రుడుగారి నభినందించుచు, తాము బోవుచున్న కార్యమున వారికి పరిపూర్ణ విజయము గలుగు గాతయని కోరుచున్నాము!

## జాబులు

తిక్కన జయంతి

రాబోవు ఫాల్గుణ ఋ ౧౧ లు తిక్కన జయంతి జరుగవలసి యున్నది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయము హైదరాబాదునందు గత మూడు నాలుగు సంవత్సరములనుండి యీ యుత్సవమును వైభవముగ జరిపించు చుండిరి. బ్ర॥ శ్రీ॥ చళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారు, గుర్జాల రామిరెడ్డిగారు మొదలగు పండితకవులు ఆహ్వానింపబడియుండిరి. కవిబ్రహ్మయు, ఆంధ్రవాఙ్మయమున కాధారపురుషుడును, అగు నీకవిపుంగవునెడల నాంధ్రులకెట్టి భక్తివిశ్వాసముల జూపినను తనివియే తీరదు. ఈ సంవత్సరమున గూడ శ్రీ॥ కృ॥ నిలయమువారు సాధ్యమైనంత వరకు నీయుత్సవమును వైభవముగ జరిపించి నిలయపు గౌరవమును గాపాడి తాము కృతార్థులగుదురుగాక అనునా యభిమతము పై నిలయపువారు నిర్వాసకులైయుండి, తంద్రి తద్దినము నే మానుకొనిన ఋల శ్రీకృష్ణ దేవరాయలవారి వర్ధంతినో, వార్షికమునో జరిపించియుండక పోవుటచే, తిక్కన జయంతి విషయమై హెచ్చరింపవలసి వచ్చినదేకాని వేరుకాదు. నిలయాభిమానులగు పెద్దలందరును, కారణముల జూపక కార్యోత్సాహమును గడింతురు గాక.

ఇట్లు
పిశపాటి వేంకటరమణయ్య

## స్థానికవృత్తాంతములు

శ్రీరాజా వెంకట రామారెడ్డి కొత్వాలుగారు

ఇటీవల ప్రకటింపబడిన ఫర్మానుప్రకారము శ్రీరాజా వెంకట రామారెడ్డి కొత్వాలుగారి యుద్యోగకాల పరిమితియందు ఆరుమాసములు హెచ్చింపబడెను. అనగా ౩౨ ఫసలి అంతమువఱకు హెచ్చినది వినుటకు చాల సంతసించు చున్నాము.

---

డాక్టరు హారోలుమర్ గారు

శ్రీ ప్రభుత్వమువారు డాక్టరు హారోల్డుమర్ గారిని వ్యవసాయ శాఖయందు పని చేయుటకై రప్పించిరి. వీరు ప్రస్తుతము బేగంపేటలో వి. యే. కాలిన్సు గారి గృహమందు బసచేసి యున్నారు. త్వరలో మండల పర్యటనము జరుపుదురని తెలియుచున్నది.

---

ప్లేగు

| | |
|---|---|
| సోమవారమునాడు | ౧౫ గురు రోగులు |
| | ౧౨ గురు చనిపోయినారు |
| బుధవారమునాడు | ౧౫ గురు రోగులు |
| | ౧౮ చనిపోయినారు |
| గురువారమునాడు | ౧ రోగి |
| | ౧ చనిపోయినారు |

౩౦ ఫర్వర్దీ వరకు మొత్తము ౨౧౮౧ గురు రోగపీడితులును ౮౯౩౭ గురు చనిపోయినరని లెక్కించపబడినది.

---

అగ్ని ప్రమాదము

మంగళవారమునాడు అంబరి పేటలో అగ్నిప్రమాదముచేత ఇండ్లు కాలిపోయెను. అగ్నిశాంతిదళము వారు పిలువబడిరి కాని అచ్చట వారి యంత్రమునకు నీరు దొరకనందున వారు వృథా యాసము కలిగినవారై తిరిగిపోయిరి.

---

తాహస్సీల్ దార్లకు శిక్ష

శ్రీ మహారాజా ప్రధాన మంత్రిగారి క్రింది తహసీలు దార్లను మొత్తలు చేసిరి. ౧ మహబూబ్ ఆలీ సాబు తహసీలుదారు

౨ మోయనోద్దీన్ ఖానుసాబు

౩ అహమ్మదుల్లా బేగ్ సాహెబు

---

ప్రొఫెసరు వీరభద్రుడు

నిజాము కాలేజి ఇంగ్లీషు వాఙ్మయాధ్యాపకులగు తణికెళ్ల వీరభద్రుడు ఎమ్. ఏ. ఎల్. టి. గారు పట్నా విశ్వవిద్యాలయములో వార్షికోపన్యాసము లిచ్చుటకై మార్చి ౧౨ వ నాడు రాత్రి బయలుదేరిరి.

---

## విశేషములు

ఒక నూతన పత్రిక

పారిస్సు నగరమందొక నూతన పత్రిక వెలువడుచున్నది. అందైదు భాషలలో వ్యాసములు ప్రచురింప బడుచున్నవి. భాషలు ౧ జర్మని. ౨ స్పాన్యిష్. ౩ ఇటాలి. ౪ ఫ్రెంచి. ౫ హాలాండు.

విద్యాసంస్థ వ్యయము

ఒక లండన్ నగరమునందే విద్యా విషయమై ప్రతి సంవత్సరం మొకకోటి ౭౫ లక్షల పౌండ్లు గత సంవత్సరమునకంటె హెచ్చు వ్యయమయ్యెను.

నోటిపండ్లతో వ్రాయుట

నాయింగ్‌హామను పట్టణమున నొక బాలిక చేతులు లేకుండ పుట్టెను. యీమె మంచి చిత్రపటములను వేయగలదు. ఏదైన నొక విషయము వ్రాయవలయునన్న కాల్బ్రేళ్ల సహాయమున కలమందుకొని తననోటి పండ్లమధ్య అమర్చి వ్రాయును.

గోళ్ల పరిమితి

మన గోళ్లు సంవత్సరమునకు ౧౧౪ అంగుళముల పొడువు పెరుగుచున్నవి.

ఇంగ్లాండు దేశమందలి సినిమాలు

ఇంగ్లాండు దేశమందు మొత్తము ౩ వేల ౭ వందల సినిమా థియేటర్లు గలవు. ప్రతివారము ౭౦ లక్షల జనులు సినిమా జూచుటకు బోవుచుందురు.

గాలియందు నడచు సైకలు

కొందరింజనియర్లొక సభయందు గాలియందు నడచు సైకలును తయారు చేయగలమని నిర్ధారణ చేసికొనిరి. యీయంత్రి సహాయమున ప్రతి మనుజుడు ఆకాశ సంచారము చేయగల్గును. దీని వెల ౯౫ పౌండ్లు వరకుండును.

గడ్డముగల స్త్రీ

ఫ్రాన్సు నగరమందొక స్త్రీకి పురుషునివలె మీసములు గడ్డము కలవు. ఈమెను జూచుటకై జనులు నానా దేశములనుండి పోవుచున్నారు.

నూతన యంత్రములు

లండను నగరమున కొన్ని స్టేషనులందు విచిత్ర యంత్రములు గలవు. అవి ప్రయాణీకులకు టికట్టునిచ్చుటయేకాక తేదీ ముద్రలను గూడ వేసి యిచ్చును.

ప్రపంచములోని పత్రికలు

| దేశము | జనసంఖ్య | పత్రికలు |
|---|---|---|
| అమెరికా | ౧౧౪ కోట్లు | ౨౦౬౭౧ |
| జపాను | ౬ కోట్లు | ౪౫౯౨ |
| కెనడా | ౭౦ లక్షలు | ౧౫౫౪ |
| హిందూస్థానము | ౩౨ కోట్లు | ౩౪౪౯ |

జపానులో, అమెరికాలో ఇంగ్లాండులో కొన్ని పత్రికల కొక్కొక్క దానికి ౧౦ లక్షలకన్న నెక్కుడు చందాదారు లున్నారు. మన దేశములో నొక్క పత్రికకైన ౫౦ వేల చందాదారులు లేరు.

---

## గ్రామ సమాచారములు

## ఖమ్మము

(స్వకీయ విలేఖరి)

### నీటివసతి

నిజాం రాష్ట్రములోని ఆంధ్రదేశమునందు వరంగల్లు తరువాత రెండవ పెద్దబస్తీయగు ఇచ్చట నీటి యిబ్బంది చిరకాలమునుంచి యున్నది. కొంతకాలము క్రింద ఇచ్చట నీటిగొట్టములు (నల్లాలు) పెట్టు విషయమును ప్రభుత్వమువారు ఏదోకొంత కార్యవాయి చేసి యుండిరి. ఈ అవసరమును ఎప్పుడు పూర్తి చేయుదురో త్వరలో ఏదైన ఏర్పాటు జరిగినచో జనుల దీవెనలు దొరతనమువారికి లభించగలవు.

### అదాలతు

ఇచ్చటి మున్సిఫీ న్యాయస్థానములో కొన్ని ముఖ్యములగు ఫౌజ్దారి మొకద్దమాలు జరుగుచున్నవి. ౧. ఇచ్చట న్యాయవాదులగు శ్రీయుత రాజేశ్వరరావుగారిమీద, ఖబరస్తాను (తురకల సమాధిస్థలమును) తవ్వించినారను నేరము ఆరోపింప బడినది. స్థానికముగు ఒకదర్గాముజావరగు మహమ్మదీయుడు ఫిర్యాదిచేసినాడు. దీనిని మున్సిఫుగారు విచారించుచున్నారు. దీనిపేషీ ౨౫ ఫర్వర్దీ తారీఖు. ౨. స్థానిక న్యాయవాదియగు శ్రీయుత రామకృష్ణయ్యగారిపైన, సర్కారువారు పొలముల హద్దులుగా ఏర్పరచిన గుర్రాళ్లను ఉద్దేశ్యముగాత్రవ్వి వేరొకచో పాతించినారను నేరమారోపింప బడియున్నది. దీనిలో ఫిర్యాదు చేసినవాడు ఆవతలిపొలపు పట్టాదారగురైతు. దీనిలో సాక్ష్యము పూర్తియైనది. ౨౫ ఫర్వర్దీ నాడు ఉభయపక్షముల న్యాయవాదులును వాదింతురని తెలియుచున్నది.

### కాలమానము

ఈ ప్రాంతములందు ఎండలు అప్పుడే ముదురుచున్నవి. ముందు ఇంకను కఠినముగ నుండునని సంశయము తోచుచున్నది.

### విద్యార్థుల వసతిగృహము

ఇచ్చటి హైస్కూలునందు అనేక మంది బాలురు పరస్థలములనుండివచ్చి చదువుకొనుచున్నారు. వీరికొరకొక హాస్టలువిద్యాశాఖవారు ఏర్పాటుచేసిన బాగుగ నుండును. ప్రజలవలన ఇంతటి గొప్పకార్యము జరుగు లక్షణములు కనుపడుటలేదు. ఈ విషయము తాలీమాతు వారుమువారు ఆలోచించ దగియున్నది.

### గ్రంథాలయ మందిరము

ఇచ్చట నొకమందిరము కలదు. కొంత పనిచేయుచున్న విద్యార్థి సంఘముచారి గ్రంథాలయమును దీనిలో నుంచినచో మందిరము సదుపయోగమునకు రాగలదు. స్థానికమహాశయులు ఆలోచింతురు గాక.

## పర్భని

(ఒక విలేఖరి)

సుమారు ౧౫, ౧౬ సంవత్సరముల నుండి పూర్ణా హింగోలీల నడుమ మోటర్లులబండి నడచుచున్నది. ఇప్పటికి ౧౬ యేండ్లైనను, ఒక్కటేబండి వచ్చును, పోవును. ప్రయాణికులు లేరందమా బండి క్రిక్కిరిసి పోవుచున్నది. విసము రెండవబండి నడపింపబడుట లేదు. హింగోలిలైను నుండి పోవువారలకు పర్భణీ, జాల్నా, మన్మాడు, బొంబాయి పట్టణముల కేగవలసి యున్నచో పూర్ణాస్టేషను మీదనే రాత్రంతయు చాల కష్టముతో గడుపవలసి వచ్చును. అచ్చట యుండుటకేగాని, నీరు త్రాగుటకేగాని యేమాత్రము వ్యవస్థలు లేవు. స్త్రీలు, బాలురతో ప్రయాణము చేయువారల దుస్థితికి మేరయేలేదు. ఏదైన సమాజమేగాని, పెండ్లివారలేగాని రాత్రి యంతయూ స్టేషనుపై నుండినచో స్టేషను యధికారులు జగడమునకు గాలుదువ్వుదురు. ౩౦-౧౨-౧౯౩౭ వరకు హింగోలీ నుండి పోవువారలకే యీ కష్టముండెనుగాని, రేల్వేవారికో యొక్క విధముగు బాధించుట చాలక, ౧-౩-౩౮ నుండి హింగోలీకి పోవువారలకు కూడ రాత్రంతయు నచట బడియుండవలసి వచ్చును. హింగోలీయొక పెద్దగ్రామము. మిలిటరీ ఛావునిగలదు. ఎందఱో యధికారులువచ్చుచు బోవుచుందురు. కనుక దయామయులగు మా ప్రభుత్వమువారు రెండవ బండిని నడిపించుటకై కంపెనీవారికి సెలవిత్తురని నమ్ముచున్నాము.

## గద్వాల

(శ్రీ మహారాణీగారిమకుటాభిషేక మహోత్సవము)

(స్వకీయ విలేఖరి)

శ్రీ గద్వాల సంస్థానాధీశ్వరులగు మహారాణీ శ్రీ ఆదిలక్ష్మీదేవమ్మగారు యీ ప్రభవ సంవత్సర ఫాల్గుణ శుక్ల ౯ నాడు కిరీట ధారణ మొనర్చి రాజ్యాభిషిక్తులైనందుకు అభినందింప దగియున్నది. వెంటనే దర్బారు గావింపబడెను. సమస్తోద్యోగులు రాజ బంధువులు యున్నతాధికారులందరు విచ్చేసి సభ నలంకరించి యుండిరి. అప్పుడు శ్రీ రాణీగారి యాదేశానుసారము, దివాన్ బహద్దరు, శ్రీమాన్ ఆరావముద అయ్యంగారు సభాభిముఖులై ఇట్లు యుపన్యసించిరి. నా ప్రజలపై నాకు పుత్ర వాత్సల్యము జనింపజేసి పాలించునట్టుల శ్రీ చెన్నకేశవుల ప్రార్థించుచున్నానని యు ప్రజలెల్లరు నాపై భక్తియుంచి తల్లిదండ్రిగా భావించి సేవింప గలరనియు మన యుభయుల ఐకమత్యాభిమానాను రాగములులేనిదే యీరాజ్యరథము నడచుట దుర్లభంబనియు రాజ్య రథమునకు ప్రజలయొక్క భక్తి విశ్వాసములే చక్రములనియు పూర్వకాలమునుండి యీ సంస్థానముపై నైజాం ప్రభువులకు అభిమానము మెండనియు, అట్లనే ఇప్పటి మన నైజాం నవాబు మీర్ ఉస్మానలీ ఖాన్ బహద్దరు పాదుషా గారున్ను నాపై యభిమానముంచి యీ సంస్థానము నేడు, నా స్వాధీనము చేసినందులకు మిక్కిలి కృతజ్ఞురాలనై యుండెదననియు ప్రజలయొక్క కష్ట సుఖములు నాదిగా భావించి ధర్మముగా పాలించెదననియు, పెద్ద తడవు నుపన్యసించి యుధియుంచిచ్చిరి. అనంతరము మహా రాణీగారి యల్లుండగు శ్రీరాజా సోమేశ్వర రాయ బహద్దరు గారు శ్రీ నైజాంగారి యొక్క ఫర్మానా సారాంశము నెల్లరకెరింగించిరి. శ్రీవారియొక్క ఔదార్యమును కీర్తించిరి. తర్వాత బ్రాహ్మణులు వారి వారికి తోచినటుల గద్య పద్యంబులచే బొగడి ఆశీర్వదించిరి. యంతలో దర్బారు ముగింపబడెను. నేటి సాయంత్రము పురల తేరు మైదానములో శ్రీ నిజాం బాదుషా గారి కొరకై దర్బారు గావింపబడెను. తత్సభకై సమస్తోన్నతోద్యోగియాది యూష వర్గంబుచే మరియు పలుపుర జనంబుచే మంటప ప్రదేశమంతయు క్రిక్కిరిసి యుండెను. తన్మధ్య భాగమున కనకమయ పీఠముపై శ్రీ నిజాం బాదుషాగారి ఛాయాపటము (ఫోటో) కుసుమమాలికాలంకృతమై విరాజిల్లు చుండెను. కొంత తడవైన పిమ్మట అవ్వలు తాలూకదారు సాహెబ్ గారగు మల్కయార్జంగు సాబుగారు యుపన్యసించిన దేమన నేటికి శ్రీరాణీగారు నైజాం నవాబుగారి యనుగ్రహంబున పురల తమరాజ్యంబు తాము బడయగలిగినందులకు తన సంతోషము వెలిబుచ్చి నైజాంగారిని కీర్తించుచు ప్రజలెల్లరు అనురక్తులై ప్రభ్విణిని సేవించ గలరనియు తాను నైజాంగారి సేవకుడైనందున వారి యాజ్ఞానుసారము యింతకాలమిచ్చటనుండి తన సేవక ధర్మము తాను నిర్వహించితిననియు యింతవరకు ప్రజలకేమయిన తనవల్ల నష్టకష్టములు గలిగియుండిన యెడల మనంబున నుంచక క్షమించ గలరనియు కొంతతడవు నుపన్యసించి విరమించిరి. వెంటనే డి. బి. ఆరావముదు అయ్యంగారు శ్రీ నైజాంగారి కీర్తినిగొనియాడుచు శ్రీ. రాణీగారు నాతలపై నిడిన అమితమైన భారమును నేటికి జగధీశుని కృపవలన నైజాంగారి యనుగ్రహముచే దింపుకొనజాలగల్గినందులకు శ్రీ పరమేశ్వరునికి ధన్యవాదము సల్పెదననియు, కొంత తడవు నుపన్యసించి శ్రీ నైజాంగారికి జయమగుగాక యని జయజయ ధ్వానము లొనర్చి, దర్బారు విరమింపజేసిరి.

---

## రయ్యత్

(ఉర్దూ వార పత్రిక)

ఆజారు ౨౪ వ తేది మొదలుకొని ప్రతి గురువారము హైదరాబాదునుండి వెలువడును. ఇందుదేశవాసుల కనుకూలములగు నైతిక, సాంఘిక, విషయములును ముఖ్యముగా రాజకీయ విషయములును, సమయానుకూలమున హాస్యపు చిత్రములును, ముద్రింపబడును. డబల్ క్రౌన్ సైజున ౧౨ పేజీలతో నుండును. సంII చందా రు ౬-౦-౦ లు.

మేనేజర్ రైయతు కార్యాలయము

త్రూపు బజారు, హైదరాబాదు దక్కన్.

# లైఫు ఇన్స్యూరెన్సు (జీవితబీమా)

వి. సూర్యనారాయణ శాస్త్రిగారు

ఇంతవఱకు బీమాయన నేమియో, నదెన్ని విధములుగా నుండునో, జీవితబీమా యవసరమెట్టిదో, దాని విధాన మెట్టిదో సాధారణముగ తెలుపబడి యుండెను, ఇప్పుడు దాని పుట్టుకను బూర్వచరిత్ర గొంత తెలిసికొందము.

ఇదివరకే చెప్పినటుల బీమా రెండువందల సంవత్సరముల కంటె పూర్వమునుండి యు నమలులో నున్నది. విదేశీయులు బీమా యవసరమును మొదట నెఱుగ గల్గిరి. బీమా పనిచే యుచుండిన పురాతనపు పాశ్చాత్య బీమాకంపెనీ యయినది రాయల్ ఎక్స్ఛేంజి (The Royal Exchange) ౧౭౨౦ సం. లో స్థాపింపబడియె. మొట్టమొదట బీమాపనికి బూనుకొనిన కంపెనీల వారెన్నియో కష్టనష్టములకు లోనుగావలసి వచ్చెను. కాని రాను రాను „ఆక్చ్యూరియల్ సైన్సు (ఆయుష్య సంబంధమయిన యర్థశాస్త్రము) అభివృద్ధి చెందగా నాకంపెనీల కష్టములు తొలగెను. క్రమముగా గవర్నమెంటువారును శ్రద్ధ గైకొని వారి వారి దేశములందు బనిచేయుచుండిన కంపెనీల యభివృద్ధికి గావలసిన చట్టముల నిర్మించి యమలులో పెట్టిరి. బీమాపని శాస్త్రయుక్తముగా నభివృద్ధిజెందుచు రాగా నొక్కొక ప్రభుత్వ శాసనములును దాని క్షేమమునకై విశాలములై వచ్చెను. జాతీయాభిమానమయిన బీమాపట్ల ప్రజలు ప్రభుత్వము సమానాదరము జూపవలసినదే గదా.

మొదట మొదట బీమా కంపెనీలలో నే యాయుస్సువారలనైనను తీసుకొను చుండెను. అన్ని వయస్సులకొక్క మొత్తమునకొక్కే కాలమునకు చెల్లింపవలసిన కిస్తు గూడ నొకే పరిమాణముగలదై యుండెను. అందువలన నసే యూహించినవారికి తెల్పుకొనుటచే మరణ ప్రమాణము (Mortality) హెచ్చి కంపెనీకి నష్టము గలుగుచు వచ్చెను. అనగా జనిపోయిన వారల వారసులకు వారు బీమా జేయించుకొనిన మొత్తములన్నియు నీయవలసి వచ్చుటచేతను, జనిపోయిన వారొకటి రెండు కిస్తులు చెల్లించి చనిపోవు చుండుటచే రాబడి తక్కువయగుటను వ్యయము హెచ్చినయి నష్టము గలుగుచుండెను. అందువలన నిదియొక పెద్ద చిక్కు తటస్థించెను. మరణ ప్రమాణము నిర్ణయించుటకై యొండొ యంశముల బరీక్షించి సిద్ధాంతీకరించుటకు నలభిసంత వైద్యసహాయము (Medical help) లేకుండెను. శాసన సహాయము మంతమాత్రమే యుండెను, ఆర్థికకష్టములన్నియు తొలగి యీ పని నిష్కంటకము లాభప్రదము నైనది.

„ఇన్స్టిట్యూట్ ఆఫ్ అక్చ్యూరీసు" (అక్చ్యురీ సంఘము లేక ఆయుష్య సంబంధమయిన ఆర్థికము నెఱింగిన సంఘము) వారు మొదట రెండు పట్టణములలో మంచి యారోగ్య స్థితులందున్న యొకే వయస్సుగల యొక్క లక్ష జనుల పట్టిక నొకదానిని సిద్ధము చేసిరి. వయస్సు జనసంఖ్య ప్రకారము ప్రతియేటను లెక్కలు జూచుకొనుచుండిరి. ఇటుల ౨౦ ఏండ్ల వయస్సువారయినపుడెంత మందికి వారే ౩౦ ఏండ్ల వయస్సు వారలయినపుడెంత మంది యుండిరను విషయము లెక్క ప్రకారము నిర్ణయించుకొని యీ పట్టికను బట్టి మరణ ప్రమాణము నిర్ణయించిరి. ఈ పట్టికలో నెన్నియో మార్పులు గలిగించిరి. తుదకు ౧౮౭౦ సం॥ ప్రాంతమున నొక స్థిరపట్టికను బ్రకటించిరి. దాని ననుసరించి మనుజుని యాయుఃపరిమాణము సాధారణ స్థితులందు ౬౦ లేక ౭౦ ఏండ్లవఱకు గలదనియు ౧౫ ఏండ్లలోపుగను ౬౦ ఏండ్లపైనను మరణ సంఖ్య పెద్దదిగా నుండుటచే నావయస్సుల మధ్యకాలమే బీమాకు యోగ్యమయినదనియు సిద్ధాంతీకరించిరి. ఆ పట్టికలోని మరణ సంఖ్యల ననుసరించి క్రమముగా ౧౫ ఏండ్లనుండి వయస్సు హెచ్చినకొలదియు మరణ ప్రమాణము యొక్క ప్రమాదము (Mortality Risk) హెచ్చునదియు గనుక వయస్సు హెచ్చినకొలదియు నొకే మొత్తము బీమా కీయవలసిన కిస్తు యొక్క గణుపును సావకాశముగా పెంచుచు వచ్చిరి. వైద్యశాస్త్ర మభివృద్ధిగాగా రానురాను మరణ ప్రమాణము నిర్ణయించు విషయము లన్నియు మనుష్య

యత్నము న్ననిర్ణయించిరి. పై విషయమును బట్టిచూచిన నిప్పటి బీమాకంపెనీ ప్రాస్పెక్టసులలో నొకపద్ధతి క్రిందగల వివిధ వయస్సులకు వేఱువేఱు గడువుల క్రిందగల రేట్లలోని భేదములకు గారణము తెలియునగుదు. తరువాత పద్ధతుల ప్రకారము బీమా చేయించుకొనుటకు బొందవలసిన వైద్య పరీక్ష యేలకో గూడ విదితము. ఈ రెండు విషయములు కంపెనీయొక్క క్షేమమున కెంత యావశ్యకమో యూహింపవగును. కంపెనీయొక్క రేట్లు మధ్యస్థమైనయు "అక్చుయరీ" సిద్ధము జేయకపోయినను, బీమా చేయించుకొనదలచినవారిని యోగ్యుడైన డాక్టరు పరీక్ష చేయకపోయినను కంపెనీకి జయము సాశయాస్పదము. అందుచేతనే ప్రతి కంపెనీవారు ఈ విషయముల పట్ల బహుజాగరూకులయి మెలగెదరు. ఇట్టి ప్రమాదమున కవకాశము తగ్గింప బడినది.

అందువలన సారాంశ మేమనగా చిన్న వయసులో బీమా చేయించు కొనుటవలన చాల లాభమనియు, వయస్సు పెరిగిన కొలదియు రేట్లు పెరుగుటచే బీమా చేయించు కొనువారు పై చెప్పబడిన యాయువులని ఖర్చులచే నష్టమనియు బీమా చేయించు కొనువారు ౨౦ వీట కంపెనీలో చేరినవారికి ౬౦ ఏండ్ల వయస్సు వచ్చినగా ౪౦ యేండ్ల గడువు లభించుటచే తాముదలచిన మొత్తము గొద్దికిస్తుల చెల్లించుట బాంధకలుగకుండనియు, పిమ్మట పెద్దదయిన రేటు పెద్దదగుటయేగాక గడువు గొలదిగానుండి భారమయిన కిస్తు చెల్లింపవలసి యుండుననియు తేలుచున్నది. బీమా కంపెనీలు ధనరక్షణ ధనాభివృద్ధి జేయుటకు మంచి పెట్టు శాసనముల వలనను నితరాంశముల వలనను బాంధవ్యోపకరుటచే బీమా చేయించు కొనువారి ధనము సురక్షితముగా నుండుననియు గూడ గ్రహింప నగును.

## పత్రికా స్వీకారము

**ఐరావతి పత్రిక, రంగూన్ సం॥ చందా ౬-8-0**

శ్రీయుత పి. వి. రెడ్డిగారి సంపాదకత్వమున వెలువడు అర్ధవార పత్రిక రెండు ప్రతులుగా ప్రతి తడవ వచ్చుచున్నది. ఇంతకు పూర్వము రెండాంధ్ర పత్రికలుండెననియు నవి యస్తమించినవనియు పత్రిక వలన తెలియుచున్నది. బర్మా దేశమునకు పూర్వము నుండియు నాంధ్రులు జీవనార్థమో, వ్యాపారార్థమో పోవుచుండెడివారు. ప్రస్తుత మా దేశమందు మన యాంధ్రులు ౧ లక్ష ౫౦ వేలున్నారు. హిందూస్థానమందలి యాంధ్రులందరిలో బర్మా యాంధ్రుల స్థితి చాల హీనముగా నున్నది. యచ్చటికి వచ్చినవారి వలన తెలియుచున్నది. ఈ ఐరావతి పత్రికయందు నొక సంచికలో ఆంధ్రులను "కోరంగీ" అని పేరు ముమ్మ నచ్చట పిలుచుచున్నారని తెలియుచున్నది.

ఈ పత్రిక యచ్చటి యాంధ్రులలో గౌరవము, ఐకమత్యము, సాంఘికాభివృద్ధి, జ్ఞానము దినదినము నాముదల్లు నాభివృద్ధి చెందింపగలదని నమ్ముచున్నాము.

## భారతకాలపు వర్ణవ్యవస్థ

పండిత కేశవరావుగారి యుపన్యాస సంగ్రహము

(మా ప్రత్యేక ప్రతినిధి)

కొలది కాలముక్రిందట ఆర్య సమాజ మందిరమునందు పండిత కేశవ రావుగారు "భారతకాలపు వర్ణవ్యవస్థ" అను విషయమై యుపన్యసించిరి. దాని సారాంశ మీక్రిందివిధమున గలదు:—

"నేటి విషయమగు భారతకాలపు వర్ణ వ్యవస్థ అనునది ఐతిహాసిక విషయము. మహాభారత గ్రంథమును బట్టియే దానిని విచారింతము. మహాభారతమునందు వర్ణింపబడిన వర్ణభేదములను చూచుటకు ముందు దానికర్తయగు వేదవ్యాసుల యొక్కయు, కథానాయకులగు కౌరవ పాండవుల యొక్కయు వంశక్రమమును విలోకింతము. కౌరవ పాండవుల మూలపురుషుడు శంతనుడు. అతనికి మొదట నొక భార్య గంగ యుండెను. ఆమె యందతనికి భీష్మాచార్యుల వారు జన్మించిరి. తరువాత శంతనుడు సత్యవతియను శూద్ర స్త్రీని వివాహమాడెను. ఆమె వలన నిద్దరు కుమారులు బుట్టిరి. ౧ చిత్రవీర్యుడు. ౨ చిత్రాంగదుడు. వీరిద్దఱును పిన్నవయస్సులోనే చనిపోయిరి. వీరికి కుమారులు జనింపలేదు. ఇద్దఱు స్త్రీలును, ఒక దాసియు నుండిరి. ఈ ముగ్గురకును వ్యాసునివలన ముగ్గురు కుమారులు పుట్టిరి. ఒకడు ధృతరాష్ట్రుడు రెండవవాడు పాండురాజు. మఱియు దాసివలన విదురుడు పుట్టెను. పాండురాజునకు సంతతి లేనందున అతని భార్యయగు కుంతి యమధర్మరాజును, వాయువును, ఇంద్రుని నారాధింప క్రమముగ ధర్మ, భీమార్జునులు దయించిరి. మహాభారతమునందు పైదేవతల విషయమై సరియైన సంగతులు చెప్పబడి యుండలేదు. అట్లే వ్యాసులవారి వంశక్రమమును గూడ చెప్పెదను. ఇతని జనకుడు పరాశరమౌని, జనని శూద్రుని కుమారికయగు సత్యవతి. ఈమెయే తరువాత శంతనుని భార్యయయ్యెను. అందువలన భీష్మాచార్యుల వారికి వ్యాసుల వారు తల్లితో పుట్టుచుండ యన్నయగుదురు. కౌరవ పాండవులకు భీష్మాచార్యులవారు తాతయైనట్లే వ్యాసులవారు గూడ నొకవిధముగా తాతయైరి. వీరందఱి వర్ణ వ్యవస్థనెట్లు చేయవలయునో తెలియకున్నది. పరాశరమౌని బ్రాహ్మణుడు; సత్యవతి శూద్రురాలు వీరికి వేదవ్యాసులు బ్రాహ్మణులుగా నెంచ బడిరి. అట్లునే శంతనుడు క్షత్రియుడు, సత్యవతి శూద్ర స్త్రీయైయునను వారిపుత్రులగు చిత్రవీర్య చిత్రాంగదులు మాత్రము క్షత్రియులని పిలువబడిరి. ఇచ్చట బీజము ప్రధానముగా నెంచబడి యుండును. కాని తరువాత చిత్రవీర్యుని స్త్రీలు క్షత్రియులును, వ్యాసులవారు బ్రాహ్మణులైనను వారిపుత్రులు క్షత్రియులుగనే యెంచబడిరి. ఇచ్చట క్షేత్రమే ప్రధానముగా నెంచబడెను. పరాశరుడు బ్రాహ్మణుడును, సత్యవతి శూద్ర స్త్రీయును, వీరల సమాగమము వలన గలిగిన వ్యాసులవారు బ్రాహ్మణులుగను, వారివల్లనే క్షత్రియ స్త్రీల యందు బుట్టినవారు క్షత్రియులైరి. వీని నన్నిటిని జూచిన నా కాలమున నిప్పటివలెగాక జాతులు గుణకర్మలవలన నేర్పడుచుండెనని యనవచ్చును. తల్లితండ్రి శూద్రాదులు వారివారి జాతివారు కాక యతని గుణములను కర్మలనుబట్టి యేర్పడిన జాతిలోనుండువారని యీయంశమువలన జూడగలము. ఇప్పుడు మహాభారతము నందలి వర్ణవ్యవస్థను గమనింతము. వర్ణముల గుఱించి భారతమున పెక్కుచోట్ల నుల్లేఖింపబడి యున్నది. ఆది, వన, శాంతి పర్వములయందే గాక మహాభారతాంతర్గతమగు భగవద్గీతయందు గూడ వర్ణముల విషయమై కలదు. వీనినన్నిటి నొక్కచోట్నే తీర్మానింప వలసియున్నది. మహాభారతమున నచ్చటచ్చట వర్ణములు వంశపరంపరాగతములుగ గూడ జూపింపబడి యున్నది. కాని దీనికి విరుద్ధముగనే యనుచాల యాధారములు గనబడుచున్నవి. ఇట్లు భిన్నములుగ గనబడుటకు కారణము ఇప్పుడు మనకు దొరకిన మహాభారతములో నొక్కని విచార పరంపరయే గాక దానికెందఱో కర్తలుండుట వలన వారియు దత్త విచారములును దానిలో చొప్పబడి యున్నవి. ఇప్పుడు మనకు లభ్యమగు గ్రంథమంతయు వేదవ్యాసునిదిగాక అందలి ౨౦౦౦ లేక ౨౪౦౦౦ శ్లోకములు మాత్రమే యతనివి. దానిని మనము గుర్తించి వేఱుపఱచుట గూడ దుస్తరమే! పైగం పాఠకులును, సూతులవారును, దానిలో నెంత భాగమును క్రొత్తగ కల్పించిరో చెప్పలేము. అంతేకాక వారి తరువాత గూడ రెండు వేల సంవత్సరములలో దానిలోనే యే మార్పులు గలిగెనో చెప్పుట గూడ దుస్సాధ్యము!

REG. No. N. 45.

REG. No. M. 2185

గోలకొండ పత్రిక

ట్రూప్బజారు హైదరాబాదు, దక్కను.

సంవత్సరము చందా రు. ౭-౦-౦

అర్ధసంవత్సరము „ „ ౩-౧౨-౦

విడి పత్రిక ౦-౧-౪

శ్రీయుత

STAMP.

Printed and Published by K. Balakrishn Peddy at the Golkonda Press, Troop Bazaar, Hyderabad Dn.